కోరుట్ల రూరల్: అయిలాపూర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

పెగడపల్లి: విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి

- జిల్లా వ్యాప్తంగా కొనసాగిన బడిబాట కార్యక్రమం

పెగడపల్లి, జూన్ 8: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, బోధనాతీరును వివరించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

కోరుట్ల రూరల్, జూన్ 8: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం పెడుతారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి అధ్యాపకుల ప్రచారం

మెట్‌పల్లి, జూన్ 8: మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపన్యాసకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకయ్య ఆధ్వర్యంలో ఇంద్రనగర్, వెంకట్రావుపేట, తదితర ప్రాంతాల్లో ఇంటర్ పూర్తయిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. కళాశాలలో వసతులు, బోధనాతీరును వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను అందజేశారు. దోస్త్‌లో మొదటి ప్రాధాన్యతను ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి: కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకయ్య, తదితరులు

త్వరలో ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి
- పీఆర్టీయూ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం

ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులతో పీఆర్‌టీయూ నాయకులు

జగిత్యాల టౌన్, జూన్ 8: రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌కు మోక్షం లభిస్తుందని, తద్వారా ఎంతోమంది పోస్టులు భర్తీ అవుతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వీకేబీ గార్డెన్స్‌లో శనివారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపెల్లి ఆనంద్‌రావు ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం త్వరలోనే అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమిస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు. పెండింగ్ బిల్లులు జూలై చివరి వారం వరకు అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు మాట్లాడుతూ, పండిత పోస్టులు అప్‌గ్రేడేషన్ పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ విద్యాసంస్థల్లో పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన 37 మంది విద్యార్థులు, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 101 మంది ప్రధానోపాధ్యాయులను జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ మాసపత్రిక సంపాదక వర్గ సభ్యుడు జాలి మహేందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముసుకు తిరుపతిరెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కిరణ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేశ్, కృష్ణమూర్తి, మండల విద్యాధికారులు గాయత్రి, జమున, గంగాధర్, భీమయ్య, నరేశం, ఆనందరావు, డీసీఈబీ కార్యదర్శి మురళీమనోహర్‌చారి, సంఘ బాధ్యులు ఏవీఎన్ రాజు, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, జమీల్, దుబ్బయ్య, చంద్రప్రకాశ్, మల్లారెడ్డి, వాజిద్, జమున, చందన, విద్యాదేవి, పద్మ, శ్రీదేవి, వసంత, రాధాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకట్రాములును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

ఉపాధ్యాయుడికి సత్కారం

మేడిపల్లి, జూన్ 8: మేడిపల్లి మండలం కట్లకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు శ్రీపాద వెంకట్రాములును శనివారం పట్టణంలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో పీఆర్‌టీయూ (టీఎస్) జిల్లా సంఘం పక్షాన ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. మేడిపల్లి మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన వైష్ణవిని సన్మానించి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. అలాగే, పాఠశాలలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రిన్సిపాల్ రాజేందర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, కార్యదర్శి ఆనంద్‌రావు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, జూన్ 8: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 22 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకే అభ్యర్థులను కేంద్రాల్లోకి పంపిస్తారని వెల్లడించారు. పరీక్ష నిర్వహణకు 386 మంది ఇన్విజిలేటర్లు, 22 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 77 మంది బయోమెట్రిక్ ఆఫీసర్లు, నలుగురు రూట్ అధికారులు, 119 మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, 154 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో వైద్య శిబిరాలు, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష నిర్వహణకు నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ దివాకర, పోలీసు నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ వినోద్ కుమార్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

ఇద్దరిపై దాడి

కొడిమ్యాల, జూన్ 8: మండలంలోని తుర్కాశినగర్ గ్రామంలో ఇద్దరిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్వ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం మంగపేట గ్రామానికి చెందిన నల్ల పవన్, నల్ల సాగర్ శుక్రవారం సాయంత్రం కారులో మంగళపేటకు వెళ్తున్నారు. తుర్కాశినగర్ రైల్వే గేటు వద్ద ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు తమ వద్ద ఉన్న బీరు సీసాలు, రాళ్లతో దాడి చేసి పారిపోయారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వెంటనే దవాఖానకు తరలించారు. పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పోతారంలో పశుగ్రాసం దగ్ధం

మల్యాల, జూన్ 8: పోతారం గ్రామంలో ఎనుగంటి ప్రశాంత్‌కు చెందిన గడ్డికట్టలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పారు. సుమారు 600 గడ్డి కట్టలు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. ఫైర్ ఆఫీసర్ మధు, ఫైర్‌మెన్లు నరేశ్, వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మంచినీటి బావిలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

సారంగాపూర్, జూన్ 8: గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రేచపల్లి గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి బావి మరమ్మతులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో మంచినీటి పథకాల మరమ్మతులకు రూ. 13.97 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన నూతుల మహేందర్ రెడ్డి తల్లి మృతి చెందగా, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భుక్యా సరళ, నాయకులు ఎండీ ఇబ్రహీం, బొడుగం తిరుపతి రెడ్డి, ఆకుల రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకన్న, రాజన్న, ఒడ్నాల రాజిరెడ్డి, బేర మహేశ్, కరబూజ మల్లేశం, గంగమల్లు, రంగు శంకర్, మోత్కురి రమేశ్, రవి, శ్రీనివాస్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★Karimnagar-Hyd Highway Road, R.K.Colony Residential & Commercial 6 Guntas Plots are available. Contact on: 7780646886.
NT-327730
CHANGE OF NAME
★S. HEMALATHA W/o. Narender H.No: 10-2-47, Sainagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. My Name was changed as Kondi Latha W/o. Narender.
NTK-311496
పాస్ పోర్ట్ పోయినది
తేది: 01/11/2014, రోజున కరీంనగర్ మంకమ్మతోట నుండి భాగ్యనగర్‌కి మా యొక్క ఇల్లు షిఫ్టింగ్ చేస్తుండగా మార్గ మధ్యంలో నా యొక్క Passport (No: G4482160) పోయినది. దొరికిన వారు సంప్రదించండి||
కన్నోజు శ్రీనివాస్
సెల్: 9959933151
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కుక్కలు బాబోయ్... కుక్కలు

చైతన్యనగర్‌లో సంచరిస్తున్న కుక్కలు

మారుతీనగర్, జూన్ 8: మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్, దుబ్బవాడ, మార్కెట్ ఏరియా, రాంనగర్, కళానగర్, రెడ్డి కాలనీ, బీడీకాలనీ, హనుమాన్‌నగర్‌తో పాటు శివారు కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాహనదారులతో పాటు ఆయా కాలనీల్లో ప్రజలపై దాడి చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన కరాటే శిక్షణ శిబిరం

పాఠశాల ఆవరణలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

జగిత్యాల రూరల్, జూన్ 8: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేసవిలో వెల్దుర్తి పాఠశాలలో నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ శిబిరం ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. 30 మంది చిన్నారులకు నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం

మల్లాపూర్, జూన్ 8: జిల్లా కేంద్రంలో ఆదివారం మున్నూరుకాపు కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా నాయకుడు లైసెట్టి శంకర్ తెలిపారు. మండలంలోని ముత్యంపేట గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందని, మున్నూరుకాపు కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట రమేశ్, ప్రశాంత్, ఆకుల గంగాధర్, దుగ్గి హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

గుండు వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు, భక్తులు

కోరుట్ల, జూన్ 8: పట్టణంలోని గుండు వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సేనాపతి ప్రవీణ్‌కుమార్, నాయకులు కృష్ణారావు, నాగభూషణం, సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

కోనరావుపేట, జూన్ 8: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ సూచించారు. మరిమడ్ల గ్రామంలో పది రోజులుగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, శనివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. విన్నర్ కోనరావుపేట జట్టుకు రూ.20వేల నగదుతో పాటు బహుమతి, రన్నరప్ మరిమడ్ల జట్టుకు రూ.10వేల నగదుతోపాటు బహుమతి అందజేశారు.

'న్యాక్'లో యువతకు ఉచిత శిక్షణ

పెగడపల్లి, జూన్ 8: మల్యాల మండలం నూకపల్లిలోని న్యాక్‌లో యువతకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఏపీఎం సమత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. 90 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు న్యాక్ డైరెక్టర్ రమేశ్ సెల్ నంబర్ 94407 85992లో సంప్రదించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

మేడిపల్లి, జూన్ 8: భీమారం మండలం లింగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

విరాళం అందజేస్తున్న మామిడి వినోద్

మేడిపల్లి, జూన్ 8: భీమారం మండలం మన్నెగూడెం శివారులోని పల్లగుట్టపై నిర్మిస్తున్న గణపతి, శ్రీరామ, వేణుగోపాలస్వామి, అయ్యప్ప ఆలయాలకు గ్రామానికి చెందిన మామిడి వినోద్-నవ్య దంపతులు శనివారం రూ. లక్షా పదహారు వేల పదహారు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, సభ్యులు కట్కం రమేశ్, ఆన్‌రెడ్డి గంగారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విప్ చిత్రపటానికి పాలాభిషేకం

కథలాపూర్, జూన్ 8: దుంపేట ఊరచెరువు కట్ట మరమ్మతులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ. 9.26 లక్షలు మంజూరు చేయించగా, పనులు పూర్తయ్యాయి. కాగా, చెరువు కట్ట వద్ద విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి రైతులు, మత్స్యకారులు శనివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఆకుల సంతోష్, తీగల మధు, ఏలేటి లక్ష్మణ్, చెదలు రమేశ్, నరేశ్‌రెడ్డి, రవి, శ్రావణ్, తీగల రాజారెడ్డి, ఆకుల పెద్ద గంగారెడ్డి, జలందర్, లచ్చన్న, బుచ్చన్న, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోరుట్ల రూరల్, జూన్ 8: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన గోపు స్వప్న ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అంజిరెడ్డి, లింబాద్రి, తుక్కయ్య, లక్పతి, సురేశ్, రాములు తదితరులున్నారు.

బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జువ్వాడి కృష్ణారావు

ఆర్థిక సాయం

నగదు అందజేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు, కండక్టర్ల సంఘం సభ్యులు

జగిత్యాల, జూన్ 8: జగిత్యాల ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న రాకేశ్ విధులకు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలు కాగా, జగిత్యాల డిపోలో పని చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు, క్లీనర్లు, సెక్యూరిటీ సిబ్బంది, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు రూ.45 వేలు జమ చేసి శనివారం అందించారు. కార్యక్రమంలో అద్దె బస్సుల సంఘం నాయకులు మల్లయ్య, రమణ, నరేశ్ పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి: డీఎంహెచ్‌వో

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: సర్కారు దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పలు సబ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్, గర్భిణుల వివరాలు, వారి పరీక్షలకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. వంద శాతం ప్రసవాలు సర్కారు దవాఖానల్లో జరిగేలా చూడాలని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు సూచించారు. ఇక్కడ ఏఎన్ఎంలు భూ లక్ష్మి, అమృతవల్లి, ఆశ కార్యకర్తలు కవిత, లత, స్రవంతి ఉన్నారు.

సీఎంతో ముఖాముఖికి విద్యార్థిని ఎంపిక

ముస్తాబాద్, జూన్ 8: బంధనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పాతూరి ప్రణవి ఇటీవల విడుదలైన పదో తరగతిలో ఫలితాల్లో 10జీపీఏ సాధించింది. ఈ సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డితో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమానికి సదరు విద్యార్థిని ఎంపికైంది. పాఠశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి, ప్రణవిని అభినందించారు.

వేతనాలపై పెంపు పై హర్షం

సిరిసిల్ల రూరల్, జూన్ 8: బీడీ పరిశ్రమలో ప్యాకర్లు, బట్టీ, టేకేదారు, బీడీ కట్టలకు బుర్రలు పెట్టె కార్మికులకు వేతనాల పెంపుపై తెలంగాణ బహుళ జన బీడీకార్మిక సంఘం, బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. తంగళ్లపల్లిలోని దేశాయి, టెలిఫోన్, ఎంఎస్ లాంగర్, ఠాకూర్ సౌదేకర్ బీడీ కేంద్రాల్లో సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులను సన్మానించారు. ఇక్కడ కార్మికులు ప్రభు, వెంకటేశం, ప్రసాద్, సురేశ్, శ్రీకాంత్, కొండయ్య, తదితరులున్నారు.

నకిలీ విత్తనాలపై అధికారుల నజర్

- రాయితీల పేరిట ప్రైవేట్ కంపెనీల గాలం

మెట్‌పల్లిలో విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి, ఎస్ఐ (ఫైల్)

మారుతీనగర్, జూన్ 8: ప్రైవేట్ విత్తన కంపెనీలు రాయితీ పేరిట రైతులను నమ్మించి మోసం చేస్తున్నాయి. వ్యవసాయాధికారులు రైతులకు విత్తనాలపై అవగాహన కల్పిస్తున్నా ఫలితం ఉండడం లేదు. జిల్లాలో వానకాలం సీజన్‌లో సాగు విస్తీర్ణం అధికంగా ఉంటుంది. వరి సుమారు 3.1 లక్షల ఎకరాలు, మక్క 41 వేల ఎకరాలు, పత్తి 20.5వేల ఎకరాలు, చెరుకు 850 ఎకరాలు, పసుపు సుమారు 10.5 వేలు, కందులు 2 వేలు, పెసర్లు, ఇతర పప్పు దినుసులు సుమారు 890 ఎకరాలు, సోయా సుమారు 660 ఎకరాలు, ఇతర పంటలు సుమారు 42 వేల ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, ప్రైవేటు విత్తన కంపెనీల యాజమాన్యాలు ఏజెంట్లను నియమించి, గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులను నమ్మించేందుకు వివిధ రకాలుగా రాయితీ ఇస్తున్నారు. విత్తనాల దుకాణ నిర్వాహకులకు సైతం రాయితీలను ఇస్తున్నాయి. గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నకిలీ విత్తనాలు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

వ్యాపారులు అధిక ధరకు విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నం. ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేసినం. వ్యాపారులు విత్తనాలను విక్రయించేటప్పుడు రైతు పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణంలోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.

- వాణిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మారుతీనగర్, జూన్ 8: మెట్‌పల్లి పట్టణంలోని సాయికృష్ణ టాకీస్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా, నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తుల సందడి

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్యాల, జూన్ 8: కొండగట్టు అంజన్న సన్నిధానంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. దొంగలమర్రి నుంచి కొండగట్టు ఆలయం వరకు మూడు కిలోమీటర్ల మేర భక్తుల వాహనాలతో ట్రాఫిక్ జామ్ కాగా, స్వామి వారి దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. ఆలయ ఈవో ఆకునూరి చంద్రశేఖర్, ఏఈవో వైరాగ్యం అంజయ్య భక్తుల రద్దీని బట్టి ఆలయ సిబ్బందికి సమాచారం చేరవేయడంతో ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. ఆలయానికి వివిధ సేవల రూపంలో సుమారు రూ. 10 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాసశర్మ, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సంపత్, బండ లక్ష్మారెడ్డి, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.